# ఉపనిషత్తుల సంక్షిప్త పరిచయం



సంకలనం

**కళానిధి సత్యనారాయణ మూర్తి**

**డా॥ రేమెళ్ళ అవధానులు**

శ్రీ వేదభారతి

# ఉపనిషత్తుల సంక్షిప్త పరిచయం

## విషయసూచిక


| | | |
|---|---|---|
| | ముందుమాట | i |
| | పరిచయం | 1 |
| 1. | ఈశావాస్యోపనిషత్తు | 5 |
| 2. | కేనోపనిషత్తు | 12 |
| 3. | కఠోపనిషత్తు | 17 |
| 4. | ప్రశ్నోపనిషత్తు | 30 |
| 5. | ముండకోపనిషత్తు | 36 |
| 6. | మాండూక్యోపనిషత్తు | 43 |
| 7. | తైత్తిరీయోపనిషత్తు | 49 |
| 8. | ఛాందోగ్యోపనిషత్తు | 62 |
| 9. | ఐతరేయోపనిషత్తు | 68 |
| 10. | బృహదారణ్యకోపనిషత్తు | 72 |
| 11. | శ్వేతాశ్వతరోపనిషత్తు | 83 |

# ముందుమాట

శ్రీవేదభారతి ద్వారా మేము లోగడ "ఉపనిషద్ రత్నావళి" అనే గ్రంథాన్ని నాలుగు భాగాలుగా ప్రచురించడం జరిగింది. అందులో ఆదిశంకరులు వ్యాఖ్యానించిన పది ఉపనిషత్తులతో బాటు శ్వేతాశ్వతరోపనిషత్తు కూడ సంక్షిప్తంగా, సామాన్య పాఠకునకు కూడా సులభంగా అర్థమయ్యే రీతిలో అతి తక్కువ సమయంలో జేరింది. పరమేశ్వరుడి దయ వలన, ఉపనిషత్తులలోని ఆధ్యాత్మికతత్త్వ బలం వలన, ప్రజాదరణ పొందింది. నాల్గవ ముద్రణకు సిద్ధంగా ఉంది.

ఉపనిషత్తుల సంఖ్య 108గా ముక్తికోపనిషత్తు పేర్కొంది. అందులో ప్రధానమైన ఉపనిషత్తులుగా ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తిరీయ, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యక ఉపనిషత్తులను పేర్కొంది. దానికి కారణం ఈ ఉపనిషత్తులలో అధ్యాత్మ విద్య సమగ్రంగా ఉండటం, వీటిలో నాలుగు ఉపనిషత్తులలో మహావాక్యాలు ఉండడమే కాక, సర్వకాల, సార్వజనీనమైన సూక్తులు ఉండటం వలన వీటిని ప్రధానమైనవిగా గుర్తించారు.

ఈ మహావాక్యాలను, సూక్తులను, పౌరాణికులు, ఆధ్యాత్మిక ప్రవచనాలు చేసే పండితులు సందర్భోచితంగా ఉదహరిస్తుంటారు. ఇవన్నీ వేదంలోనివే గనుక మన సనాతన ధర్మాన్నే బోధిస్తాయి. అందుచే వీటన్నింటిని సేకరించి ఒక చిన్న పుస్తకంగా ప్రచురించి మన సనాతన ధర్మాన్ని సంక్షిప్తంగా అందరికి అందించాలనే భావంతోను, సందర్భోచితంగా వాటిని జ్ఞప్తికి తెచ్చుకుంటే అవి సరైన మార్గనిర్దేశం చేస్తాయనే తలంపుతోను, పిల్లలకు కంఠస్థం చేయిస్తే, వారికి భవిష్యత్తులో బాగా ఉపయోగిస్తాయనే అభిప్రాయంతోను ఈ పుస్తకాన్ని ప్రచురిస్తున్నాము.

పెద్దలు చదివి పిల్లలకు కూడా బోధిస్తారనే ఆశతో, సనాతన ధర్మ ప్రచారమే ధ్యేయంగా అతి తక్కువ ధరకు ఈ పుస్తకాన్ని అందిస్తున్నాం. తెలుగు ప్రజలు ఆదరిస్తారని, ప్రోత్సహిస్తారని ఆశిస్తున్నాం!!!

ప్రకాశకులు

హైదరాబాద్
నందన "విజయదశమి"
24.10.2012

## ముఖచిత్ర వివరణ :

తైత్తిరీయ ఉపనిషత్తులో వర్ణించిన మహా సంహితలను దృష్టిలో ఉంచుకొని ఈ చిత్రాన్ని రూపొందించడం జరిగింది (53వ పేజి; 11వ ప్రశ్న).

## అధివిద్యము :

ఆచార్యుడు - పూర్వరూపము
శిష్యుడు - ఉత్తరరూపము
విద్య - సంధి
ప్రవచనము - సంధానము

**ఓంకారము నిరాకారుడైన పరమాత్మను సూచిస్తుంది.**

**విశ్వం సాకారుడైన పరమాత్మను సూచిస్తుంది.**

# పరిచయం

**1. ప్ర. ఉపనిషత్తులు అంటే ఏమిటి?**

స. 1. జన్మ రాహిత్యానికి, లేక, మోక్ష ప్రాప్తికి ఉపయోగించే మంత్రవాక్య సముదాయాన్ని ఉపనిషత్తులంటారు.

2. ఆత్మజ్ఞానము అని మరొక అర్థము.

3. ఆత్మజ్ఞానాన్ని ఉపదేశించే గురువునకు సమీపముగా ఉండుట అని ఇంకొక అర్థము.

**2. ప్ర. ఉపనిషత్తులకు ఉన్న ఇంకొక పేరేమిటి ?**

స. సామాన్యంగా ఉపనిషత్తులు వేదాలకు చివరి భాగాల్లో ఉంటాయి. అందుచేత ఉపనిషత్తులకు వేదాంతములు అని ఇంకొక పేరు ఉంది.

**3. ప్ర. ఉపనిషత్తులను 'రహస్యం' అని ఎందుకు పిలుస్తారు ?**

స. 'ఉపనిషత్' శబ్దానికి చెప్పిన అనేక అర్థాలలో ఒకటి 'రహస్యము' అను అర్థం. రహస్యము అనగా తెలియడం కష్టమైనా ప్రయత్నపూర్వకంగా తెలిసికొనదగినది. ఎక్కడనో సుదూరదేశంలో ఉన్న వస్తువు కూడా తెలియనిదే. కాని దానిని 'రహస్యం' అని అనం. అదే విధంగా, ఎక్కువ మందికి తెలుసుంటే, దానిని కూడ రహస్యం అనరు.

ఏది మనకు దగ్గరనే ఉంటూ మనకు తెలియదో అది పరమరహస్యం. ఇలాంటి పరమరహస్యం ఆత్మతత్త్వం. ఆత్మ అనేది 'నేను, నేను' అను అనుభవంలో అందరికీ గోచరమైనదే. అయినా కూడ దాని తత్త్వం, యథార్థ స్వరూపం ఏమో ఎవరికీ తెలియదు. అందుచేతనే ఇది పరమరహస్యం, ఉపనిషత్తు. ఈ పరమరహస్యానికే కాకుండా, దీనిని బోధించే గ్రంథానికి కూడా ఉపనిషత్తు అని పేరు.

**4. ప్ర. ఉపనిషత్తు అనే పదానికి ఉన్న మరి కొన్ని అర్థాలను వ్రాయండి?**

స. 1. జీవులలో ఉండే అవిద్య అను సంసారబీజమును నాశనము చేయునది అని ఒక అర్థం,

2. మోక్షాన్ని ఆకాంక్షించేవారిని పరమాత్మదగ్గరకు జేర్చేది అని ఒక అర్థం.

3. జన్మ, వార్ధక్యము మొదలైన ఉపద్రవాలను శిథిలము చేయునది అని ఒక అర్థం,

4. అధ్యయనం చేసేవారికి ఉపనిషత్తు అంటే "గ్రంథం" అని ఒక అర్థం, ఆ గ్రంథం ద్వారా అందించబడిన "విద్య" అని ఇంకొక అర్థం – ఇంకా ఎన్నెన్నో అర్థాలు ఉన్నాయి.

***వ్యుత్పత్తి:*** **సదేర్ధాతో : విశరణ గత్యవసాదనార్థస్య ఉపనిపూర్వస్య క్విప్ప్రత్యయాంతస్య రూపం ఉపనిషదితి – శ్రీ శంకర భగవత్పాదులు**

**5. ప్ర. "ఓం శాంతి : శాంతి : శాంతి :" అనే శాంతి పాఠానికి అర్థం ఏమిటి ?**

స. ప్రతిమనిషిని మూడు రకాల దుఃఖాలు బాధించడానికి అవకాశం ఉంది. వాటిని ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధి దైవిక దుఃఖాలు (లేక, తాపాలు) అంటారు.

శరీరంలో ఉద్రేకాల వలన కలిగే రోగాలు, సోమరితనం, కపటం మొదలైన దుర్గుణాల వలన కలిగే ఉపద్రవాలను ఆధ్యాత్మిక దుఃఖాలు అంటారు.

పంచమహాభూతాల నుండి (ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథ్వి), శత్రు, చోర, మృగ, కీటకాదుల వలన కలిగే ఉపద్రవాలను ఆధిభౌతిక దుఃఖాలు అంటారు.

అతివృష్టి, అనావృష్టి, పిడుగుపాటు, గ్రహబాధలు మొదలగు వాటి మూలంగా కలిగే ఉపద్రవాలను ఆధిదైవిక దుఃఖాలు అంటారు*.

పరమాత్మ చింతనము ఈ పై మూడు రకాల దుఃఖములను శాంతింపజేయుగాక ! అని ఈ శాంతి పాఠము బోధిస్తోంది!

* (ఈశావాస్యోపనిషత్తు వివరణోపన్యాసము
– అరిపిరాల వేంకట సోమాచార్యులు)

**6. ప్ర. పది ఉపనిషత్తులను గుర్తించే శ్లోకం ఏది ?**

స. ఈశ కేన కఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరాః ।
ఛాందోగ్యమైతరేయం చ బృహదారణ్యకం తథా ॥

తాత్పర్యం (ఉపనిషత్తుల పేర్లు) :

1. ఈశావాస్య
2. కేన
3. కఠ
4. ప్రశ్న
5. ముండక
6. మాండూక్య
7. తైత్తిరీయ
8. ఛాందోగ్య
9. ఐతరేయ
10. బృహదారణ్యక

**7. ప్ర. శంకర భగవత్పాదులు ఎక్కువ పర్యాయములు ఉదహరించిన ఇంకొక ఉపనిషత్తు ఏది ?**

స. శ్వేతాశ్వతరోపనిషత్తు.

**8. ప్ర. నాలుగు వేదాలకు చెందిన మహా వాక్యాలేమిటి ? అవి ఏ ఉపనిషత్తులలో ఉన్నాయి ?**

స.

| | | |
|---|---|---|
| ఋగ్వేదం | ప్రజ్ఞానం బ్రహ్మ | ఐతరేయోపనిషత్తు |
| యజుర్వేదం | **అహంబ్రహ్మాస్మి** | బృహదారణ్యకోపనిషత్తు |
| సామవేదం | **తత్త్వమసి** | ఛాందోగ్యోపనిషత్తు |
| అథర్వణవేదం | **అయమాత్మాబ్రహ్మ** | మాండూక్యోపనిషత్తు |